
# రాములమ్మ కల

## నందిగం కృష్ణారావు

ఆ సచ్చినోడు రాములమ్మకి పీడకలలా తయారయ్యాడు. ఆడు నిజంగానే సచ్చిపోయాడు. ఆడి చావు రాములమ్మ కళ్ళారా చూసింది. ఆడు సచ్చాడో లేదో తేల్చుకోవడానికి అందరూ తుపికి, తుపికిన ఆడి శవం మీద ఉమ్మేస్తుంటే, రాములమ్మ ఒక పెద్ద బండరాయి తీసుకుని ఆడి మొహంమీద విసిరింది. అప్పటికీ ఆడు కదల్లేదు. చావడానికి ముందు ఊరందరూ ఆడి వెంటపడి తరిమి తరిమికొడుతుంటే ఆశ్చర్యంతో తెరచుకున్న ఆడి నోరు అలాగే వుండిపోయింది. అలా మీదపడి తొక్కేస్తున్నప్పుడు భయంతో తెరచుకున్న కళ్ళు అలాగే వుండిపోయాయి. రాళ్ళదెబ్బల్ని తప్పించుకోడానికి, ఎలుగు సూడలేనోడు సూరీడికి సేతులడ్డం పెట్టినట్టు ఆడు అడ్డం పెట్టిన చెయ్యి గాల్లో అలాగే వుండిపోయింది. రాములమ్మ విసిరిన రాయి ఆడి పెదాల్ని చీరేసింది. ముందు పళ్ళు రాలిపోయాయి. అప్పుడు ఎందుచేతో గాని ఆడు ఉత్త ఎర్రోడ్లా కనిపించాడు. 'ఈడ్నీ చూసేనా? తాము ఇంతకాలం భయపడ్డది' అనుకుని అందరూ ఆశ్చర్యపోయారు. ఆడ్ని చూడ్డాని కసహ్యం వేసి మొహం పక్కకి తిప్పేసుకున్నారు.

ఆ వేటగాడు ఆరు సంవత్సరాల క్రితం వచ్చాడు. అప్పుడాడికి ముప్పయ్యేళ్ళు. అడవిలోంచి తప్పించుకొచ్చిన దున్నలాగుండేవాడు. ఆడి దూకుడు చూస్తే ఎదురుగా వచ్చేవాళ్ళని కుమ్మేస్తాడేమోననిపించేది. అందుచేత అందరూ ఆడ్ని చూసి మనకెందుకొచ్చిన గొడవన్నట్టుగా పక్కకి తప్పుకునేవారు. రావడం రావడంతోటే ఆడు ఆగస్టు పదిహేనో తారీకు వాడు జండా ఎగరెయ్యడానికని కట్టిన గద్దెనెక్కి నిల్చుని దారిపోయే వాళ్ళందరినీ పిల్చి "నేనెవర్నో తెలుసా" అని అడిగాడు. ఈడెవడో లాగుబోతో, పిచ్చోడో అన్నట్టుగా, అందరూ ఆడికేసి ఆశ్చర్యంగా చూశారు. అప్పుడాడు ఎదురుగ్గా నిల్చున్న ఓబులేసుని "ఒరేయ్ నా కొడకా, నిన్నేరా! యిటురా" అని పిల్చేడు.

ఆ గుంపులో వున్న వాళ్ళల్లోకల్లా ఓబులేసే బలవంతుడు. ఆడు ఎవరి సహాయం లేకుండా ఒక్కడే వందకేజీల బియ్యం బస్తాని అవలీలగా ఎత్తుకోగలడు. ఆ పేటలో వున్నవాళ్ళు ఎవరే పని చేయలేకపోయినా తోడ్పడలాడు. అందరూ అతన్ని 'ఓబులేసన్నా' అని పిలుస్తారు. అలాంటివాణ్ణి పట్టుకుని వాడు అలాగ అమర్యాదగా మాట్లాడ్డం చూసి అందరికీ కడుపు మండిపోయింది.



'ఓబులేసు ఊరుకోడ్లే.. ఏం జరుగుతుందో చూద్దాం' అనుకుని ఊరుకున్నారు చుట్టూ విల్చు న్నవాళ్ళు.

'నేనెవర్ని' అని తిరిగి అడిగాడు.

నువ్వెవరివైతే నాకేటన్నట్టుగా చూసి ఓబులేసు ఎనక్కి తిరిగాడు. ఆ ధిక్కారం ఆడి మొహంమీద కాక గుండెలమీద గుద్దినట్టు తగిలింది. కోపంగా ముందుకు వెళ్ళి 'అగు నా కొడకా! అగు' అని అరుస్తూ ఓబులేసు మొహంమీద గుద్దేడు. ఆ అదురుకతను కిందపడగానే, కాళ్ళతో తన్నేడు.

ఓబులేసు లేచి ఆడిమీదకి లంఘించగానే జేబు లోంచి కత్తి తీసి అతని కడుపులో కసుక్కున పొడిచాడు. 'అమ్మా' అంటూ ఓబులేసు కిందపడి మెలికలు తిరగసాగాడు. ఆ అరుపుకి చచ్చిపోయిన అతని తల్లి స్వర్గంలో వుండుంటే ఇది స్వర్గం కాదు నరకం అనుకుని, అక్కడ్నించి తప్పించుకొచ్చి కొడుకుని గుండెల్లో దాచుకునేది. నరకంలో వుండి వుంటే ఇది కూడా ఒక నరకయాతనే అనుకుని కుమిలిపోయేది. బుగ్గి గాల్లో కెగసిపో యింది కాబట్టి, ఒక ఈదురుగాలై దూసుకువచ్చి ఆడి కళ్ళల్లో దుమ్ముకొట్టింది.

బాధతో గిలగిల కొట్టుకుంటున్న ఓబులేసుని, చుట్టూ చేరిన వాళ్ళంతా, ఎత్తుకుని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు.

పాతిక సంవత్సరాల క్రితం అదే పేటలో వుండి లారీ డ్రైవర్‌తో లేచిపోయిన మాలచ్చి కొడుకు వాడు. ఆరోజు పొద్దున్నే మాలచ్చి ఆ పేటలో దిగింది. ఏమాత్రం సిగ్గూ, ఎగ్గూ లేకుండా మారా జులు ఏనుగెక్కి వచ్చినట్టుగా, దర్జాగా కొడుకుని వెంటబెట్టుకుని వచ్చింది.

రావడం రావడంతోటే ఆది అంతకుముందు మొగుడితో కలిసి కాపురం చేసినప్పుడు వున్న గుడిసె దగ్గరకు వచ్చింది. అక్కడ గుడిసె లేదు. ఇప్పుడక్కడ కోమటిసెట్టి జనార్దనరావు కట్టు కున్న పెంకుటిల్లు వుంది. ఆ ఇంటి ముందర గదిలో అతను చిల్లర కొట్టు నడువుతున్నాడు. ఆ టైంలో సెట్టి స్నానానికి వెళ్లాడు. అతని భార్య గోవిందమ్మ కొట్లో కూర్చుని బేరాలు చూసు కుంటోంది. గోవిందమ్మకీ, మాలచ్చికీ సుమారుగా ఒకే వయస్సుంటుంది. అందుచేత గోవిందమ్మని చూసి తను ఎల్లినాక తన మొగుడు రెండో పెళ్ళి చేసుకున్నాడేమోననుకుంది మాలచ్చి. "ఎవతివే నువు? నా సవతి.. పెళ్ళి పెళ్ళాన్ని నేనుండగా, ఆ లంజ కొడుకు నిన్ను తెచ్చిపెట్టుకున్నాడేటే" అని అరుస్తూ గోవిందమ్మని అమాంతం జుట్టు పట్టుకుని రోడ్డుమీద కీడ్చేసింది. గోవిందమ్మ ఆశ్చ ర్యాన్నించి తేరుకోకముందే ఫెడీఫెడీమని ఆమె వీవుమీద పిడిగుద్దులు గుద్దేసింది.

గోవిందమ్మకి ఒకవేపు కోపమూ, మరోవైపు అవ మానంతో దుఃఖం వచ్చింది. ఆమె కళ్లు క్రోధంతో, బాధతో సుడిగుండాలయ్యాయి.

ఈ గలభాకి చుట్టూ చేరిన జనం మాలచ్చినీ, దాని పక్కన నిల్చున్న దాని కొడుకునీ వింత మృగాల్ని చూసినట్టు చూశారు.

ఇంతలో లోపల్నించి సెట్టి తల తుడుచుకుంటూ బయటికి వచ్చాడు. బయట జరుగుతున్నది చూసి అతనికి మతిపోయింది. బిత్తరపోయి అలాగే చూస్తూ నిలబడిపొయ్యాడు.


మాలచ్చి కొట్టినందుకు కాక మొగుడు మౌనంగా వున్నందుకు గోవిందమ్మకి దుఃఖం వచ్చింది. దాన్నే మైనా అంటే అది తిరిగి తంతుందేమోనని భయపడింది. దాని మాటల్ని బట్టి అది తనకు సవతైనా అయ్యుంటుంది. లేదా తన మొగుడుం చుకున్నదైనా అయి వుంటుందనుకుని మొగుణ్ణి తిడితే దాన్ని తిట్టినట్టేనని నిశ్చయించుకుంది.

"ఏరా? ఛీ నీ ముఖానికి కట్టుకున్న పెళ్ళాం చాలదని ఇంకొకతిని వుంచుకున్నావుటరా? పాపిష్టి ముండాకొడుకా? నీ నోరు పడిపోను, నా ఉసురు పోసుకుని నువ్వు నీ ముండా ఏటి బాగుపడతావో సూస్తా" అని తిట్లు లంకించుకుంది.

గోవిందమ్మ మొగుడి పేరుమీద మాలచ్చిని తిడుతోందని ముందుగా మాలచ్చి కొడుకు గ్రహిం చాడు. అందుచేత ఒక్క ఉదుటున ముదుకురికి "ఒసే! నంజకానా.. నోరుముయి, మాట మాట్లాడి నావంటే నాలిక చీరేస్తాను. నేను ఎవుర్ననుకున్నావు? రాజుని. నే తలుసుకుంటే నిన్ను ఇక్కడే పాతె య్యగలను" అంటూ జేబులోంచి కత్తితీశాడు. దానిమీద సూర్యకిరణాలు పడి తళుక్కున మెరిసి, చుట్టూ వున్నవాళ్ళ కళ్ళల్లో రక్తవు జీరైంది.


భయంతో అంతా ఎక్కడి వాళ్ళక్కడే బిగుసు కుపోయారు.

సెట్టిని చూడగానే షాక్‌తో నోరు తెరుచుకునుం



# మా ఊరు

మాట్లాడ్డానికేముంది!
నిర్మానుష్యమైన ఊరు ముందు
విద్యుద్దీపంలా నిలబడి ఏడ్వటం తప్ప
పగిలిన కుండపెంకులు
కాటికుండ బొచ్చెల్లా కాళ్ళకు తగుల్తుంటే
సగం సగం కాలిన గుడ్డ పేలికలు గాల్లో గాలిపటాలై ఎగుర్తున్నాయ్
కోడి కదికినట్టు చెల్లా చెదురైన కొట్టాల వాసాలు
కాల్చిపారేసిన పాడెల్లా కన్పిస్తుంటే
తలుపులు మాత్రం
బొగ్గుల్ని కౌగలించుకుని నిలువునా నిలబడినట్టున్నాయ్
ఫైర్ ఇంజన్లు నీటి వల్ల కాబోలు
తడిసిన మొండి గోడలు పడిపోయి మట్టి సమాధుల్లా దర్శనమిస్తున్నాయ్
ప్లాస్టిక్ సంచులేవో కప్పకుని మొండిగోడల్లోనే ఉంటున్నారు
వృద్ధులు, పిల్లలు, ఆడవాళ్ళు అశక్తులై కన్పిస్తున్నారు
మగముఖాలు కనపడ్డం లేదు
తరిమివేయబడ్డారో! తప్పించుకున్నారో!
పార్టీ కొంపల్లో బతకలేక చచ్చిపోతున్న జనం
ఊరికి పట్టిన గతిని ఎవ్వరికీ చెప్పకోనూ లేదు
నోరు తెరచి ఎవ్వర్నీ నిందించనూ లేదు
అంతటా స్తబ్దత–కళ్ళ నిండా భయం



నిజానికిప్పుడు
మా ఊరు ఊరులా లేదు
కాలిన పూలతోటలా ఉంది
స్మశానాన్ని కౌగలించుకుని బావురుమంటున్న కన్నతల్లిలా ఉంది

–ఎస్.షమీఉల్లా

డిపోయిన మాలచ్చికి అప్పుడు నోరు పెగిలింది. "నువ్వెవడివిరా? పందికొక్కులాగా నా ఇంట్లో జేరిపోయినావు" అంటూ జనార్దనాన్ని తిట్టింది.

"ఏవమ్మోయి మాటలు జాగ్రత్తగా రానియి" అని కసిరాడు సెట్టి. అతని ధైర్యం చూసుకుని గోవిందమ్మ విజృంభించింది. "ఇప్పుడు సెప్పవె నువు వుంచుకున్న ముండవో, కట్టుకున్న దానవో" అంది.

ఇంతలో అక్కడికి చేరినవాళ్ళలోంచి ఒక ముసల్ది ముందుకువచ్చి సోడాబుడ్డిలాంటి పాత కళ్ళజోడు మీద అరచేయి పెట్టి పరీక్షగా చూసి "నువ్వటే మాలచ్చీ... అప్పట్నించీ పోల్చుకోలేకపోయాను" అని చెప్పింది.

మాలచ్చి ముసల్దాన్ని పరీక్షగా చూసింది. అది ఎవరో కాదు తన సిన్నత్తేనని గుర్తుపట్టింది. "ఏటత్తా ఈ గోరం? ఈడెవుడో నా ఇంట్లో దూరిపోయి నా మొగుణ్ణి పొట్టన పెట్టుకున్నాడు" అంటూ బొలబొలా ఏడ్చింది.

ముసిల్ది ఆశ్చర్యపోయింది. మాలచ్చి మొగుణ్ణొదిలేసి లేచిపోయినప్పుడెలాగుందో ఇప్పుడూ అలాగే వుంది. కాకపోతే కాస్త జుట్టు నెరిసింది. దాని మొగుడు యిస్తారిగోడు పెళ్ళాం ఒగ్గేసిందన్న అవమానం తోటీ, పిల్లాడు దూరమయ్యాడన్న దిగులుతోటీ నలభైయేళ్ళకే మంచంమీద పడి తీసుకు తీసుకు చచ్చిపోయేడు. ఆడు చావడానికి ముందు ఆణ్ణి మాలచ్చి కనుక చూసుంటే ఆడు తన మొగుడు కాదని, మొగుడు తాలూకు దయ్యమే ననుకుని జడుసుకునేది. ఆడి వైద్యానికయిన ఖర్చులు అప్పిచ్చిన సెట్టి ఆడు చచ్చిపోయినాక ఆడి గుడిసెని స్వంతం చేసుకుని అది కూల్చేసి, పెంకుటిల్లు కట్టేడు. ఈ భోగట్టా అంతా సిన్నత్తనించి తెలుసుకున్న మాలచ్చి ముందుగా సచ్చిన మొగుణ్ణి తలుచుకుని బొలబొలా ఏడ్చింది. ఆ తరువాత సెట్టికేసి తిరిగింది. సెట్టి కల్పించుకుని "విషయం తెలుసుకోకుండా మాట్లాడడం మంచిదికాదమ్మోయి" అన్నాడు.

"ఏటి నీ మంచి. నా మొగుడికి మందెట్టి సంపింది కాక నన్ను ఇవాళ రోడ్డున పడేసిన నీతో నాకు మంచేటిరా" అంటూ గయ్యమని లేచింది.

సెట్టికి గుండె జారిపోయింది. "నీ మొగుడు ఆడి ఇష్టపూర్వకంగా నాకీ ఇల్లు రాసిచ్చాడు" అని గొణిగాడు.

"కట్టుకున్నదాన్ని నేనుండగా, కన్నకొడుకు ఈడుండగా మమ్మల్ని కాదని, నీ పెళ్ళాన్ని తార్చినందుకు రాసిచ్చినాడేటి నా మొగుడు నీకీ యిల్లు" అంది మాలచ్చి.

దీని నోట్లో నోరుపెడితే మర్యాదగా బతికి బట్టకట్టడం కష్టం అని తేల్చుకుని, సుట్టూ చేరిన జనంకేసి చూసి "ఇది న్యాయంగుందేటి? మీరైనా చెప్పండి" అడిగాడు సెట్టి.

"ఆళ్ళు సెప్పేదేటి? నేను సెబుతున్నాను. ఈ ఇల్లు మాది. రెండు గంటలు టైం ఇస్తున్నాను. ఇల్లు ఖాళీచేసి మాకప్పజెప్పు, కాదంటే ఈ ఇంటి తోపాటు నిన్నూ అందులో పెట్టి కాల్చి బూడిద చేస్తాను" అని హెచ్చరించి "నేను ఎవుర్ననుకున్నావు? మాలచ్చి కొడుకుని, మారాజు-నీ" అని తనను తాను పరిచయం చేసుకుని, ఆ పేటకి తాను రాజునని పరోక్షంగా పరిచయం చేసుకున్నాడు.

ఆ తరువాత చరచరా వెళ్ళిపోయి సెంటర్‌లో వున్న జండా కర్ర దగ్గర ఓబులేసుని పొడిచి, ఆ పేటలో జండా ఎగరేశాడు. అది తెలిసి సెట్టి చెప్పాపెట్టకుండా రావాల్సిన బాకీలొదిలేసి, పెళ్ళాం బిడ్డల్తో ఇల్లు ఖాళీచేసి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

అప్పట్నించీ రాజు ఆ పేటకి మహారాజు, ఆ ఊరికి రౌడీ. ఆడి కన్ను పడిందంటే ఆడది గుడ్డలి ప్పెయ్యాలి. మొగోడు పీవు అప్పజెప్పి ఊరుకోవాలి. కాదంటే కడుపులోకి కత్తి దిగేది. ఆడి కన్ను పడ్డ ఇల్లు బుగ్గైపోయేది.

మారాం చేసే పిల్లల్ని "అదిగో రాజుగోడు వస్తున్నాడు చూడు" అని భయపెట్టే ఓరు తల్లి దండ్రులు.

ఎందుసేతోగానీ పోలీసులు కూడా ఆడి జోలికి రాలేదు. అందుచేత ఆ పేటలో వాళ్ళంతా ఈదురుగాలికి అల్లల్లాడిన ఆకుల్లా ఒదిగిపోయారు. ఆడి కారణంగా ఎవరు, ఎప్పుడు, ఏ క్షణాన రాలిపోతారోనన్న భయంతో, బెంగతో బతికారు. అలాంటివాడి పాపిష్టి దృష్టి రాములమ్మ మీద పడింది. ఆ రోజు రాములమ్మకి కుడి కన్ను అదిరింది. అమె ఉదయం లేచేసరికి ఆకాశం మేఘావృతమై వుంది. సూర్యోదయం అయినప్పటికీ ఇంకా లోకం వెలుగు చూడలేదు.

మొన్ననెప్పుడో వస్తానని ఊరెళ్ళిన మొగుడు ఇంకా రాలేదేమిటని దిగులుగా వుండింది రాములమ్మకి.

కుక్కి మంచంమీంచి అసహనంగా లేచి నోట్లో నీళ్ళోసుకుని పుక్కిలించి మొగుడొస్తున్నాడేమోనని వీధి తలుపు తీసి చూసింది.

ఎక్కడా మొగుడి జాడ లేదు. అదే టైంకి బీడీల కోసం బయటకొచ్చిన రాజుగాడి దృష్టి రాములమ్మ మీద పడింది.

రాములమ్మ అందాల్ని, ఒంపుసొంపుల్ని సూడగానే ఆడి దిమ్మదిరిగిపోయింది. రాములమ్మ తలుపేసుకుని ఇంట్లోకెళ్ళిపోయినా, ఆడు అలాగే తలుపు సెక్కలా వుండిపోయాడు.

రాములమ్మ మొహం కదుక్కుంది. టీ నీళ్ళు కాసుకు తాగింది. స్నానం చేసింది. అప్పుడు ఒంటిమీద గుడ్డలిడిచేసింది. ఆ తరువాత ఉతికిన రైక తొడుక్కుంది. లంగా వేసుకుంది. చీర కట్టుకుంది. ఆమె చేసే పనులన్నిటికీ సాక్ష్యం తలుపు సెక్కే. ఆ తలుపు చెక్కకే ప్రాణం వచ్చినట్టుగా ఆ బాగోతాన్నంతా ఊహించుకుని ఆ పనులన్నీ ఆమె తనకోసమే చేస్తోందనుకుని మురిసిపోయేడు రాజుగోడు.

ఏమై వుంటుంది...? ఎందుకు రాలేదు..? తన మామ ఇన్నాళ్ళు తనని ఒంటరిగా వదిలేసి ఎలా వున్నాడు. అత్తనికేమైనా అయిందా? చేలో కెళ్ళినప్పుడు ఏ విషసర్పమో ముట్టిందేమో, వస్తున్న దార్లో ఏ బస్సో గుద్దిందేమోనన్న ఊహలు ఆమెని విషసర్పాల్లా ముట్టడించాయి. ఆందోళనతో మరోసారి వీధి తలుపు తీసి, వీధి చివరి వరకు చూసింది.

అది తనకు ఆహ్వానం అనుకుని రాజుగోడు నవ్వుతూ ముందుకు నడిచాడు. అప్పుడు రాజుగోణ్ణి గమనించింది రాములమ్మ.

ఏనుగులు ఘీంకరిస్తాయని తెలుసు రాములమ్మకి, సింహాలు గర్జిస్తాయని తెలుసు, పులులు గాండ్రిస్తాయని తెలుసు, పాములు బుసలు కొడతాయనీ తెలుసు. ఈ జంతువులేవీ నవ్వవని కూడా తెలుసు. అలాగనక జరిగుంటే అందులో ఏదో అపశృతి వుందని, తను నిలుచున్న నేల తన కాళ్ళ కిందనుంచి కుంగిపోతోందనిపించింది రాజుగోడి నవ్వు.

భయంతో ఒంటినిండా చమట పట్టేసింది. ఇంట్లో ఏదో కుక్క జొరబడి అన్నం గిన్నెలో మూతిపెడుతున్నప్పుడు అయిన శబ్దాన్ని విన్నదానిలా "చయ్.. చయ్.. నీ యమ్మ కడుపుకాలా" అని తిట్టుకుంటూ తలుపు వేసింది రాములమ్మ. ఆ తరువాత దొడ్లోకెళ్ళి "అత్తోయ్! అత్త! ఏటి చేస్తున్నావు" అని అరిచింది.

"ఒస్... ఏటే? వస్తున్నానుండవే" అని పలికింది, అత్త రాములమ్మ యింటి ఎడం పక్కన వున్న పూరి గుడిసెలోంచి.

రాములమ్మ ఇంటికి కుడివేపు వున్న ఇంట్లో వుండే సీతాల్ని పిల్చింది.

"రాత్రి మావకోసం వండిన మాంసం కూర వుండిపోయింది. తీసికెళ్ళి పిల్లలకైనా పెట్టు" అంది రాములమ్మ. "ఇప్పుడే వస్తానుండు" అని పలికింది సీతాలు.

తన యింటి పక్కన మనుషులున్నారు. వాళ్ళు తను పిలిస్తే పలుకుతున్నారు. తాను అడవిలో వుండడంలేదు. మనుషుల మధ్యలో వుంటోంది. ఇంక తనకెందుకు భయం? అనుకొని ధైర్యం చేసుకొంది. ఆమె మనసు కుదట పడింది.

కాసేపటికి అత్త వచ్చింది. ఆ వెనకే సీతాలు కూడా వచ్చింది. "మావ రాలేదు. పొద్దుటినుంచీ కుడికన్ను అదురుతోంది. నాకేదో భయంగా వుందే అత్తా" అంటూ కన్నీళ్ళు పెట్టుకొంది.

"తులసాకు రెప్పమీద పెట్టు రోగం పోతుంది" అని చెప్పింది అత్త.

"ఒసే జాగ్రత్తగా వుండు. ఆ ముదనష్టపోడి కన్ను నీ మీద పడ్డట్టుంది" అని గుసగుసలాడుతున్నట్టు చెప్పింది సీతాలు.

"అయితే ఏటే" అంది అత్త.

"ఆడి సంగతి నీకు తెలవదు. సింత మాను కింద వున్న సింహాద్రి పెళ్ళాం మీద కన్నేసి, అది కాదందన్న కక్షతో సింహాద్రిగోణ్ణి చంపేసి రైలుపట్టాల మీద పడేశాడు" అని చెప్పింది సీతాలు.

ముసిల్దాని గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి.

ఈడు తన మామని ఏం చేశాడో...? అన్న అనుమానం రాములమ్మ గుండెల్లో పొడసూపింది. అది క్రమంగా వేళ్ళూనుకొని, బలంగా ఎదిగి ఆమె హృదయాన్నంతా ఆక్రమించి వెయ్యి తలల విషనాగై బుసలు కొట్టింది.

భయంతో ఒణికి పోయింది.

"పేటకాడు రావణాసురుడిలా తయారైయ్యాడు... ఈడి పీడ ఎప్పుడు విరగడౌతుందో" అని మెటికలు విరిచి, యీడు పంపు దగ్గర నీళ్ళట్టుకొంటున్న ఆడాళ్ళ రైకల మీద నీళ్ళు జల్లి ఎకిలి


**'JES' వారి అపూర్వ కానుక 'జ్యోతి' ఎలక్ట్రానిక్ ఇన్వర్టర్**

''జ్యోతి'' మీ చెంతనుండగా కరంటు లేదని చింత ఏల! కరంటు లేదని చింతిస్తున్నారా! కాంతులు విరజిల్లేందుకు, దీర్ఘకాలిక మన్నికకు వాడండి JES వారి జ్యోతి ఎలక్ట్రానిక్ ఇన్వర్టరు. 150w నుండి 1.0 kv వరకు పూర్తి రక్షణతో, అన్ని రకముల సదుపాయములతో ఒక సంవత్సరం సర్వీసు, వారంటీతో మీకు అందుబాటులోనే కలదు. ''జ్యోతి'' ఎలక్ట్రానిక్ ఇన్వర్టరు

డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి




మరియు

★ "జ్యోతి" బ్యాటరీ ఛార్జింగ్ మిషన్లు
★ "జ్యోతి" స్టెబిలైజరు
★ "జ్యోతి" ఛార్జింగు లైట్లు, ఎమర్జన్సీ లైట్లు
★ "జ్యోతి" సోలార్ బ్యాటరీ ఛార్జర్లు
★ "జ్యోతి" సోలార్ వీధి దీపములు
★ "జ్యోతి" డొమెస్టిక్ సోలార్ లైట్లు
★ "జ్యోతి" Led-Acid బ్యాటరీలు

సరసమైన ధరలకు లభించును.
వివరములకు సంప్రదించండి

JYOTHI ENERGY SYSTEMS
TAMASOMA JYOTIRGAMAYA

**జ్యోతి ఎనర్జీ సిస్టమ్స్**

2-10-3, జూబ్లీ రోడ్డు (చర్చి ప్రక్కన), తాడేపల్లిగూడెం-534 101, ఫోన్ నెం: 21032, 83236

మార్కెటింగు కార్యాలయములు:- 6-1-140/A, పద్మారావునగర్ సికింద్రాబాదు; రామారావుపేట కాకినాడ; శ్రీరామపురం భీమవరం; మెయిన్‌రోడ్డు తణుకు; విజయవాడ.

చేష్టలు చేస్తున్నాడంట కదా" అని అడిగిందత్త.

"అవును ఆడికెదురైన మొగాడు ఆడికి దండవెట్ట కపోతే బాదేస్తున్నాడు. అందరి దగ్గరా మామూళ్ళు వసూలు చేస్తున్నాడు" అని చెప్పింది సీతాలు.

"ఏం రోజులొచ్చి పడ్డాయో తల్లో దయ్యాలకి దండాలెట్టే రోజులొచ్చాయి" అంది అత్త.

రాములమ్మ మతిలేని దాన్లా చూస్తూ వుండిపోయింది. "నువు కొంచెం జాగ్రత్తగా వుండే తల్లీ" అని హెచ్చరించి లేచి వెళ్ళిపోయిందత్త. కాసేపటి తరువాత సీతాలు కూడా వెళ్ళిపోయింది.

ఆ వేళ రాములమ్మ వంటచెయ్యలేదు. కాలు గాలిన పిల్లిలా ఇంట్లోనే అటూ, ఇటూ తిరిగింది. ఏవేవో ఊహించుకొని భయపడింది. సాయంత్రం మొగుడొచ్చేవరకూ అలాగే గడిపేసింది. ఆ తరువాత అతన్ని పట్టుకొని భోరు భోరున ఏడ్చింది. చివరికతను ఆమెని వదిలి ఎక్కడికీ వెళ్ళనని ప్రమాణం చేసేంతవరకూ ఏడ్చింది. ఆ తరువాత అతను దేవుడి మీద ప్రమాణం చేసి మాటిచ్చాడు కాబట్టి. అతను యీ లోకాన్నైనా సరే తనని వదిలి వెళ్ళడని నిశ్చయించుకొని కొంత కుదుటపడింది.

ఆ రాత్రి రాములమ్మ మొగుణ్ణి హత్తుకొని నిశ్చింతగా పడుకొంది. తెల్లారగట్ట ఆ సచ్చినోడు ఆమె కల్లోకొచ్చాడు. అప్పుడు ఆకాశమంతా మబ్బు పట్టి వుంది. ఊరంతా మంచు కురుస్తోంది. మనిషిని మనిషి పోల్చుకోలేనట్టుంది. తను మామ కోసం ఊరంతా వెదుకుతోంది. ఎక్కడా మామ కనిపించలేదు.

ఎక్కడా మనుషులు కనిపించడంలేదు. మబ్బుల మధ్యన తను ఒక్కతే నిలబడ్డట్టుగా వుంది.

ఏ క్షణంలోనైనా తన కాళ్ళ కింద దూది పింజాల్లా వున్న మేఘాలు కదిలిపోయి తను నేల రాలిపోవచ్చు. అప్పుడు తను ఏమైపోతుందీ?... "మామా మామా నువు ఎక్కడున్నావు మామా!" అని భయంతో అరిచింది.

తన మాట తన గొంతులోనే వుండిపోయింది. ఇంతలో ఎక్కడ్నించో ఒక చేయి వచ్చి తనని గట్టిగా పట్టుకొంది.

"అమ్మయ్య" అని నిట్టూర్చింది. ఎవరబ్బా తనని కాపాడింది? అనుకొని అటు చూసింది. ఆ చేయి తన మావది కాదు. చిత్రం అది... అది... ఒక కొండ చిలువ. తనని బలంగా చుట్టుకొని చిర్నవ్వు నవ్వుతోంది. తను ఆ నవ్వు ఎక్కడో చూసింది. ఎక్కడ... ఎక్కడా... ఎక్కడబ్బా? తను తలుపు తీసినప్పుడు రాజుగోడు ఇట్లాగే నవ్వాడు. అనుమానం లేదు. ఆడే, ఆడే, ఆ సచ్చినోడే. ఆ కొండచిలువ నించి తప్పించుకోవడానికి, ఆడి కబంధ హస్తాల్లోంచి బయటపడ్డానికి పెనుగులాడింది.

"ఏటే కుమ్మేస్తున్నావ్" అని విసుక్కున్నాడు ఆమె మొగుడు. ఉలిక్కిపడి లేచింది. ఆమె గుండెలు అదురుతున్నాయి. యింతసేపు తను కన్నది కలే, నిజం కాదని తెలుసుకొన్నందుకు కొంత ఊరట పడింది.

## అజ్ఞానం!

మహామహుడు లింకన్‌ను ఓ చిన్ననాటి స్నేహితుడు అడిగాడు 'లింకన్ గారూ! మనిషి తాను ఎంతటి అజ్ఞానంలో ఉన్నాడో ఎలా తెలుసుకొనగలుగుతాడు?'

'విలువైన గ్రంథాలను, మంచి పుస్తకాలను ఎంత ఎక్కువగా చదువుతూ ఉంటే, అంత ఎక్కువగా మనకు తెలుస్తూ ఉంటుంది – మనం ఎంతటి అజ్ఞానంలో పడి కొట్టుమిట్టాడుతున్నామో!' అని చెప్పారు లింకన్.

–కొడిమెల శ్రీరామమూర్తి

భయంతో ఒంట్లో వున్న శక్తంతా హరించుకుపోయింది. నాలుక పిడచకట్టుకు పోయింది. దాహం, దాహం... నీళ్ళు కావాలి అనుకొంటూ నెమ్మదిగా లేచి మంచినీళ్ళ కుండ దగ్గరకు వెళ్ళి గ్లాస్ అందులో పెట్టింది. ఖాళీ కుండ వెక్కిరించింది.

తాగటానికి నీళ్ళెక్కడివి? ఎక్కడి నీళ్ళూ వాడికే సరిపోవడం లేదు. అసలే ఎండాకాలం, నీళ్ళ కరువు. రోజిడిసి రోజు నీళ్ళొదులుతున్నారు. అద్దైనా ఏ అరగంటో వస్తున్నాయి. అప్పడా సచ్చినోడు వచ్చి పంపు దగ్గర స్నానం చేస్తాడు. ఆ తరువాత ఆడింటికి సరిపడా నీళ్ళు పట్టుకున్నాకే, యింక పంపు వస్తే ఎవరికైనా నీళ్ళు దక్కేది.

ఆ వేళ రాములమ్మ ఆడి భయానికి నీళ్ళకి వెళ్ళలేదు. తెల్లారగట్ట వచ్చిన కల నిజమౌతుందంటారు. ఆడు తన కుటుంబాన్నంతా కొండచిలువలా మింగేస్తాడేమో...? దేవుడా నువ్వే నాకు దిక్కు. మమ్మల్ని కాపాడు స్వామీ అనుకొని మెళ్ళో వున్న పుస్తెల తాడుని కళ్ళకద్దుకొని, గోడకి తగిలించి వున్న వెంకటేశ్వరస్వామి పటానికి దండం పెట్టుకొంది.

అప్పట్నుంచీ ఆ సచ్చినోడు ఆమెకి పీడకలలా తయారయ్యాడు.

ఆ వేళ మధ్యాహ్నం మావుళ్లయ్య కూతురి పెళ్ళి. ఆ పెళ్ళికి ఆ పేట పేటంతా తరలి వెళ్ళింది.

అసలే ఎండాకాలం. పైపెచ్చు నీటి కటకట. మధ్యాహ్నం కావటంతో "ఆకలి" అని చెప్పలేని పిల్లలు ఏడవడం మొదలుపెట్టారు.

పెళ్ళి వాళ్ళు వచ్చిన వాళ్ళని భోజనాలకి పిలవకపోవడం అందరికీ చికాగ్గా వుంది. ఆలస్యానికి కారణం ఏమిటో ఎవరికీ అంతు పట్టడంలేదు. వంట చేస్తున్న వాళ్ళు ఎండుచేతో వుండి వుండి బయటికి వచ్చి చూస్తున్నారు.

వాళ్ళనీ వీళ్ళనీ పలుకరిస్తూ అటూ ఇటూ తిరుగుతున్న మావుళ్లయ్య దృష్టి రోడ్డుమీదే వుంది. యింకా ఎవరైనా రావాల్సిన వాళ్ళు వున్నారేమోననుకొన్నారంతా.

వెళ్ళిపోవడానికి సిద్ధమైన వాళ్ళని మావుళ్లయ్య చెయ్యి పట్టుకొని "భోజనం చేసి వెళ్ళమని" చెప్పి వెనక్కి తీసుకువస్తున్నాడు.

"నీళ్ళ వ్యాన్ ఎప్పుడో బయల్దేరిందంట. మధ్యలో ఏటైందో ఏమో"నంటూ కబురు తెచ్చాడొక పనివాడు.

"నీళ్ళ వ్యాన్ని రాక్షసుడెత్తుకు పోయాడంట... అమ్మో... ఊరుకో... ఏడ్చే పిల్లల్ని కూడా ఎత్తుకెళ్తాడంట" అంటూ ఒక తల్లి ఏడుస్తున్న బిడ్డని, భయపెట్టి నోరు మూయించింది.

పెళ్ళి వాళ్ళు అగౌరవ పరిచారనుకొని నీరసించిన వాళ్ళంతా, ఆళ్ళ ప్రతిష్ట నిలబడాలని కోరుకొన్నారు. ఆ నీళ్ళ వ్యాన్ కోసం వీధికేసి చూడసాగారు.

నీళ్ళ వ్యాన్ ఎంతకీ రాలేదు. అందరికీ ఆకలిగా వుంది. విసుగ్గా వుంది. చిరాగ్గా వుంది.

"రాజుగోడు నీళ్ళ వ్యాన్ని బలవంతంగా ఆపి ఆళ్ళ యింటికి తీసుకు వెళ్ళాడు" అని అప్పడే వచ్చిన వాళ్ళు చెప్పారు.

అందరూ ఒక్కసారిగా షాక్ తిన్నారు. ఆ తరువాత ఒకర్నొకరు చూసుకొన్నారు. వాళ్ళ కడుపులో వున్న ఆకలి గుండెల్లోకి పాకింది. వాడికి వ్యతిరేకంగా యింత కాలం పేరుకొన్న జుగుప్సా, అసహ్యం, కోపం, కసీ ఒక్కసారిగా బయటకు తన్నుకొచ్చాయి. అప్పటివరకూ వాళ్ళల్లో వున్న అసహనం వాళ్ళని ఒక్క క్షణం కూడా నిలబడనివ్వలేదు.

"ఇంకా చూస్తారేంటి? పదండెహే" అన్నారెవరో. అగ్ని పర్వతం బద్దలైంది. లావాలా ఒక్కసారిగా అందరూ బయటకు పరిగెట్టారు. రోడ్డు వెయ్యడానికి ఒక పక్కన పడేసి వున్న కంకరాళ్ళని తీసుకొన్నారు. అప్పుడు రాజుగోడు ట్యాంక్‌లో నీళ్ళు బకెట్లల్లోకి పడుతున్నాడు.

"రేయ్" అంటూ ఉప్పెనలా తన్నుకొచ్చారు.

"పెడ పెడ మని వాడిమీద రాళ్ళ వర్షం కురిసింది. అది చూసి ఆడి తల్లి బయటికి రావడానికి సాహసించలేదు. యింటెనకనించే పారిపోయింది.

భయంతో వాడికి విపరీతమైన దాహం వేసింది. నోరు తెరచి "దాహం... దాహం" అన్నాడు. ఒకరిద్దరు వాడి మీద పడి కసిగా తొక్కారు. వాడు చేసిన అవమానానికి తలెత్తుకు తిరగలేక పోతున్న ఒక ఆడ కూతురు వాడి నోట్లో ఒకటి పోసింది.

గుడ్లు తేలేశాడు వాడు. ఒంటిమీద తగిలిన గాయాల్తోటో, జరిగిన అవమానంతోటో చచ్చిపోయాడు వాడు.

అయినా వాళ్ళు వాణ్ణి వదల్లేదు. ఆ రాత్రి కూడా రాములమ్మకి అదే పీడకల వచ్చింది. "ఆడు సావలేదు, ఆడు సావలేదు" అంటూ యింట్లోంచి బయటకు పరిగెత్తుకొచ్చింది. అది చూసి చుట్టుపక్కల వాళ్ళంతా వెంట పరిగెత్తారు. అంతా వాణ్ణి పూడ్చిన దగ్గరకు చేరుకొన్నారు.

వాడి సమాధిని తవ్వేశారు. శవాన్ని బయటకు తీసి ముక్కలు ముక్కలుగా నరికారు. ఆ ముక్కల్ని కాకులకీ, గెద్దలకీ విసిరారు.

కాకి ముట్టిన తరువాత నిశ్చింతగా వెనక్కి తిరిగారు●